సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం, 3, ఫిబ్రవరి, 2025



తెలంగాణకు అన్యాయం..

బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మోదీ ప్రభుత్వం వివక్ష చూపిందని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. - 8లో



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

చెరువుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభంకానున్నాయి. - 8లో



ఉంద్రుగొండలో అఘోరీ..

చివ్వెంల మండల పరిధి ఉంద్రుగొండలో అఘోరీ హల్‌చల్ చేసింది. పలువురు ఫొటోలు తీస్తుండగా దాడికి యత్నించింది. - 8లో

న్యూస్‌రీల్

పగటి ఉష్ణోగ్రతలు పైపైకి



భువనగిరి : ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రత జనవరి 31వ తేదీన 31.1 డిగ్రీలు నమోదు కాగా ఆదివారం 35.8 డిగ్రీల సెల్సీయస్‌కు చేరింది. మూడు రోజుల వ్యవధిలోనే 4.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇది సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతకు ఉక్కపోత కూడా తోడవడంతో ఇళ్లలో ఫ్యాన్లు, ఏసీ, కూలర్ల వాడకం పెరుగుతోంది. దీని వల్ల విద్యుత్ వినియోగం అధికమైంది.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ఉద్యోగులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, మైనార్టీ ఉద్యోగులు

భువనగిరి : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉద్యోగులు వారిధిగా పనిచేయడం జరుగుతుందని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ జగన్, మైనార్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమద్ లాయక్ అలీ, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, రాష్ట్ర కో ఆర్డినేటర్ జమాల్ షరీఫ్, బియబాని, ముజఫర్ అలీ, అఫ్రోజ్, జాఫర్, సలీం పాష తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు బీజేపీ జిల్లా సారథి నియామకం

- నేడో, రేపో ప్రకటించే అవకాశం

సాక్షి,యాదాద్రి : బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడి నియామక ప్రక్రియ తుది దశకు చేరింది. నేడో, రేపో అధ్యక్షుని పేరు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఊట్కూరి అశోక్ గౌడ్, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పడమటి జగన్ మోహన్‌రెడ్డి పేర్లను స్క్రీనింగ్ కమిటీ రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఇందులో ఒకరి పేరు ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లా సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర నాయకత్వం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు బీసీ, నల్లగొండ ఓసీ, సూర్యాపేటకు ఎస్సీని అధ్యక్షుడిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నేడో, రేపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

తాగునీటికి యాక్షన్ ప్లాన్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గంగాధర్

సాక్షి, యాదాద్రి : మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి గంగాధర్ తెలిపారు. ముఖ్యంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణాల్లో భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమృత్–2 నిధులతో చేపట్టిన పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, పారిశుద్ధ్యం, మౌళిక వసతుల కల్పన, ప్లాస్టిక్ నిషేధం వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు ప్రభుత్వం తనను ప్రత్యేక అధికారిగా నియమించిందని, యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ ముందు కెళ్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలను దశలవారీగా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

ప్రాక్టికల్స్.. నిఘా నీడలోనే!

సీసీ కెమెరాల ఏర్పాటుపై పలు కళాశాలలు అభ్యంతరం.. వెనక్కి తగ్గని ఇంటర్‌బోర్డు

- మాస్ కాపీయింగ్‌కు తావుండొద్దని నిర్ణయం
- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
- జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు.. ప్రతి సెంటర్‌లో రెండు సీసీ కెమెరాలు
- హాజరుకానున్న 6,418 మంది విద్యార్థులు



కళాశాలలు	పరీక్ష కేంద్రాలు
64	42
విద్యార్థులు బైపీసీ 1,272	
విద్యార్థులు ఎంపీసీ 2,113	
ఒకేషనల్ ఫస్టియర్ 1,561	ఒకేషనల్ సెకండియర్ 1,472

భువనగిరి : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఈసారి నిఘా నీడలో నిర్వహించనున్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పరీక్ష కేంద్రంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై పలు కళాశాలల యాజమాన్యాలు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. ఇంటర్‌బోర్డు అంగీకరించలేదు. ఇప్పటికే ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు ముగియగా.. సోమవారం (నేడు) నుంచి ఈనెల 22వ తేదీ వరకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీతో పాటు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

42 కేంద్రాలు : జిల్లాలో 64 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 11 ప్రభుత్వ, 7 కేజీబీవీ, 7 మోడల్, 22 ప్రైవేట్‌తో పాటు గురుకుల కాలేజీలు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం

ప్రశ్నపత్రం 30 నిమిషాల ముందు ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. అనంతరం కేంద్రాల ఇంచార్జిల సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ప్రకారంగా ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసి సీసీ కెమెరాల నిఘాలో ప్రింట్ తీసి విద్యార్థులకు అందజేస్తారు.ఈసారి డీఓ వ్యవస్థను రద్దు చేశారు.

పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు 6,418 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ 3,385, ఒకేషనల్ విద్యార్థులు 3,033 మంది ఉన్నారు.

నాలుగు విడతల్లో పరీక్షలు

ప్రాక్టికల్ పరీక్షలు నాలుగు విడతల్లో జరగనున్నాయి. మొదటి విడుత 3 నుంచి 7వ తేదీ వరకు, రెండో విడత 8 నుంచి 12, మూడో విడుత 13 నుంచి 17, నాలుగో విడుత 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. విద్యార్థులు 50లోపు ఉంటే పక్క కళాశాలకు మార్చారు. 25 మంది విద్యార్థులకు ఒక ఎగ్జామినర్‌ను ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై చివరి వరకూ ఉత్కంఠే..

ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించాలనే ఇంటర్‌బోర్డు నిర్ణయాన్ని కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వ్యతిరేకించాయి. నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు తమ కళాశాలలను ఇవ్వమని సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. కానీ, ఇంటర్‌బోర్డు వెనక్కి తగ్గకుండా సీసీ కెమెరాల నిఘాలోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రతి పరీక్ష కేంద్రంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒకటి ల్యాబ్ లోపల, మరొకటి ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. వీటిని ఇంటర్ ఎగ్జామ్ బోర్డు హైదరాబాద్‌కు అనుసంధానం చేయనున్నారు. అక్కడ ఒక బృందం కెమెరాల ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించనుంది.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షల తీరును రాష్ట్ర అధికారులు పర్యవేక్షిస్తారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ప్రాక్టికల్స్ చేయాలి. ఒత్తిడికి గురికావొద్దు. సకాలంలో పరీక్షలకు హాజరుకావాలి. – రమణి, డీఐఈఓ



కేసారంలో నిర్వహించిన దేవరపెట్టె ఊరేగింపులో పాల్గొన్న యాదవులు, గ్రామస్తులు



కేసారం నుంచి దేవరపెట్టెను తరలిస్తున్న యాదవులు



దేవరపెట్టెకు పూజలు నిర్వహిస్తున్న కేసారం గ్రామస్తులు

ఒలింగా.. ఓలింగా..

వైభవంగా పెద్దగట్టు దిష్టిపూజ మహోత్సవం

- కేసారం నుంచి గట్టుకు చేరిన దేవరపెట్టె
- భారీగా తరలివచ్చిన భక్తులు

చివ్వెంల, సూర్యాపేట టౌన్: యాదవులు రెండేళ్లకోసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి జాతరకు వేళయింది.ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న జాతరకు 15 రోజుల ముందు నిర్వహించే దిష్టి పూజ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది.శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం నుంచి మహాయాత్రగా సూర్యాపేట మండలం కేసారం తీసుకొచ్చిన దేవరపెట్టెకు ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన మెంతబోయిన, మున్న, గోర్ల, బైకాను వంశస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీలింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మలతో ఉన్న దేవరపెట్టెతో పాటు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి, కుంకుమ, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుగ్గిలం, మైశాచి, తల్లి, పిల్ల గొర్రెను ఊరేగింపుగా పెద్దగట్టుకు తీసుకొచ్చారు. భక్తులు భారీగా తరలిరావడంతో గొల్లగట్టు ఓలింగా నామస్మరణతో మార్మోగింది. డప్పులు, భేరీల చప్పుళ్ళు, గజ్జెల లాగుల సవ్వడితో గట్టుపైకి దేవరపెట్టెను చేర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దిష్టిపూజకు అవసరమైన రెండు బోనాలను మున్న, మెంతబోయిన వారు తీసుకొచ్చి శ్రీలింగమంతులస్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బైకాను కథకుడి ఆధ్వర్యంలో దేవరపెట్టె ముందు చంద్రపట్నం (పసుపు ముగ్గు) వేశారు. ముగ్గుకు రెండు వైపులా నూనెతో దీపాలు వెలిగించారు. లింగమంతులస్వామి దిష్టి కుంభంపై ఉన్న అన్నం ముద్దను మున్నవారికి, చౌడమ్మతల్లి దిష్టికుంభంపై ఉన్న అన్నం ముద్దను మెంతబోయిన వారికి ప్రసాదంగా అందించి దిష్టిపూజ ముగించారు.

భారీ పోలీస్ బందోబస్త్

దిష్టిపూజ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆలయం చుట్టూ బలిహరణ

చివరగా తల్లి, పిల్ల గొర్రెలను అమ్మవారికి బలిచ్చి రక్తం నైవేద్యంలో కలిపి ఆలయం చుట్టూ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, డైరెక్టర్లు పోలెబోయిన నరేష్ యాదవ్, కుర్ర సైదులు, మెంతబోయిన లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద రిటర్నింగ్ అధికారి కార్యాలయం పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు



ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 10వ తేదీ వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉదయం 11గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు..

ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 27 పోలింగ్, మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది.

అభ్యర్థి వెంట ఐదుగురికి అనుమతి

నామినేషన్ల నేపథ్యంలో నల్లగొండ కలెక్టరేట్ వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌కు 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్ల లోపు మూడు వాహనాలు, నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.

నిబంధనలు ఇవీ..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు సమర్పించే వారు జనరల్ అభ్యర్థి అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎమ్మెల్సీకి పోటీ చేసే వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలో జనరల్ ఓటరై ఉండాలి. రాష్ట్రంలోని ఏ జిల్లాల్లో కూడా ఓటు హక్కు లేకపోతే పోటీకి అనర్హుడు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థికి పది మంది ప్రపోజల్స్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. వారంతా వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఈ మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరై ఉండాలి.

సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృతి చేసేందుకుగాను నామినేషన్ల స్వీకరణ హాల్ ముందు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్లు నింపడంలో ఎలాంటి సందేహాలున్నా అక్కడి సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. నామినేషన్లు నింపుకుని వచ్చిన అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా అన్నీ ఉన్నాయా.. ఇంకా ఏవైనా పూర్తి చేయాలా.. ఏవైనా సర్టిఫికెట్లు జత చేయాలా తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ సమర్పించేందుకు ఎక్కువ మంది ఒకేసారి వస్తే ఇబ్బంది కలుగకుండా వెయిటింగ్ హాల్ కూడా ఏర్పాటు చేశారు.



బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రజావాణి రద్దు

భువనగిరి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు నిర్వహించే ప్రజావాణితో పాటు ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసే వరకు ప్రజావాణి ఉండదన్నారు. ప్రజలు గమనించి వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

జలసిరి.. అంతటా వరి

2,71,002 ఎకరాల్లో నాట్లు పూర్తి



- మరో 30 వేల ఎకరాల్లో నాట్లు పడే అవకాశం
- వానాకాలంతో పోలిస్తే అధికంగా సాగు
- తగ్గిన వర్షాధారిత పంటలు.. మొత్తం 500 ఎకరాల్లోపే..

రామన్నపేట : యాసంగి సీజన్‌లో వరి సింహభాగం కానుంది. మొత్తం సాగు విస్తీర్ణంలో వరి ఇప్పటివరకు 2,71,002 ఎకరాలకు చేరింది. ఫిబ్రవరి చివరి నాటికి మరో 30వేల ఎకరాలు పెరిగే అవకాశం ఉన్నది. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. దీనికి తోడు మూసీ కాలువలకు సమృద్ధిగా నీటిని వదలడం.. భువనగిరి, ఆలేరు డివిజన్ పరిధిలోని చెరువుల్లోకి మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలు చేరుతుండడంతో మెజార్టీ రైతులు వరి వైపు మొగ్గు చూపారు. 2,91,000 ఎకరాల్లో వరి సాగుకానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా.. మూడు లక్షల ఎకరాలు దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వివిధ పంటల సాగు (ఎకరాల్లో)	
గడ్డి జొన్నలు	275
సోయాబీన్	44
మినుములు	15
పెసళ్లు	10
వేరుశనగ	19
పారగడ్డి	30
నువ్వులు	03
అలసందలు	15
పొగాకు	27
నేపియర్ గడ్డి	19

మూడేళ్లుగా నిలకడగా యాసంగి సాగు విస్తీర్ణం


యాసంగి వరి నాట్లు చివరి దశకు చేరాయి. నీటి లభ్యత సమృద్ధిగా ఉండడంతో వరి సాగు విస్తీర్ణం మూడు లక్షల ఎకరాల మార్కు దాటే అవకాశం కనిపిస్తోంది. గడిచిన మూడేళ్లుగా చూస్తే కాస్త అటూఇటుగా వానాకాలంతో సమానంగా యాసంగిలోనూ వరి సాగవుతుంది. 2023 వానాకాలం 3,05,691 ఎకరాలు, యాసంగిలో 2,93,292 ఎకరాల్లో వరి వేశారు. అలాగే 2024 వానాకాలం 2,81,885 ఎకరాల్లో సాగైంది. యాసంగిలో 2,91,000 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 2,71,002 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి.

వర్షాధారిత పంటలపై అనాసక్తి

మెజార్టీ రైతులు వరి సాగుకు మొగ్గు చూపడంతో ఇతర పంటలు తగ్గుముఖం పడుతున్నాయి. సోయాబీన్, మినుములు, గడ్డి జొన్న, గడ్డి జొన్న, పెసళ్లు, వేరుశనగ, నువ్వులు తదితర వర్షాధారిత పంటల సాగు నామమాత్రంగా ఉంది. గత యాసంగిలో 1,100 ఎకరాల పైగా సాగు కాగా.. ఈసారి 500 ఎకరాల లోపే వేశారు.

సాగు పెరిగే అవకాశం ఉంది

జిల్లాలో వరిసాగు విస్తీర్ణం 2.70 లక్షల ఎకరాలు దాటింది. కొన్ని ప్రాంతాల్లో ఇంకా నాట్లు వేస్తున్నారు. ఫిబ్రవరి 20 వరకు మరో 30వేల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. రైతులకు కావాల్సిన ఎరువులు, యూరియా, పై మందులు అందుబాటులో ఉంచాం. వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమైన మోతాదులో వాడాలి. – గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి



నిండుగా ప్రవహిస్తున్న పిలాయిపల్లి కాల్వ



యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనంకోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు చేసి, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించి, సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో ఊరేగించారు.



మూసీ ఆయకట్టులో సాగు చేసిన వరి చేలు

క్లుప్తంగా

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



నవనీత మృతదేహం

పాలకవీడు: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన పాలకవీడు మండలంలోని హనుమయ్యగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణావత్ కృష్ణ, శిరీష దంపతులకు ఏడాదిన్నర పాప నవనీత ఉంది. కృష్ణ సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం శిరీష, కుమార్తె స్వగ్రామం వచ్చారు. తల్లి ఇంటి పనులు చేస్తుండగా.. పాప ఆడుకుంటూ ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడిపోయింది. కొద్దిసేపటికి గమనించిన తల్లి పాపను బయటకు తీసి బోరున విలపించింది. చుట్టుపక్కల వారు గమనించి అంబులెన్స్‌లో మిర్యాలగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవనీత మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

ఉండ్రుగొండలో అఘోరీ ప్రత్యక్షం

- సెల్ఫీ అడిగిన యువకుడితో ఘర్షణ



యువకుడితో గొడవ పడుతున్న అఘోరీ

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో అఘోరీ హల్‌చల్ చేసింది. శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి నుంచి వేములవాడకు వెళ్తూ మార్గమధ్యంలో ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆర్చి వద్ద భోజనం చేసేందుకు ఆగింది. పలువురు ఆమెను ఫొటోలు తీస్తుండటంతో తనను ఎందుకు ఫొటోలు తీస్తున్నారని వారిపై దాడికి ప్రయత్నించింది. దీంతో వారు ఆమెను కొట్టారు. ఆమె తన కారులో ఉన్న తల్వార్ తీసి గొడవ చేసింది. గ్రామస్తులు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెకు నచ్చజెప్పి గ్రామం నుంచి తీసుకువచ్చారు. రాత్రి ఖాసీంపేట గ్రామ శివారులో తన కారులోనే నిద్రించింది. ఆదివారం తెల్లవారుజామున టిఫిన్ చేయడానికి వెళ్లడంతో ఓ యువకుడు ఆమెను సెల్ఫీ అడగడంతో అతడిపై దాడికి దిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేశ్వర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను అక్కడి నుంచి పంపించారు.

కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

మఠంపల్లి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మాళోతు బాలునాయక్ అన్నారు. ఆదివారం ఆయన మఠంపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలోకి నెట్టే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని ఆరోపించారు. గిరిజన సబ్‌ప్లాన్‌కు రూ.3,54,249కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. గిరిజనుల అభివృద్ధిపై కేంద్రం స్పష్టమైన వైఖరి అవలంబించకుంటే ఉద్యమిస్తామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- చెర్వుగట్టులో భక్తుల కోసం ఆరోగ్య కేంద్రాలు, విచారణ కేంద్రాలు
- అందుబాటులో రెండు అంబులెన్స్‌లు
- ప్రత్యేక బస్సు సర్వీసు కేటాయించిన ఆర్టీసీ అధికారులు



నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ వెల్లడించారు. ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి, అక్కెనపల్లి డాక్టర్లు విజయ్‌కుమార్, వరూధిని తెలిపారు. గట్టు పైన నార్కట్‌పల్లి పీహెచ్‌సీకి చెందిన 20 మంది సిబ్బంది, గట్టు కింద అక్కెనపల్లి పీహెచ్‌సీకి చెందిన 20 మంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అదేవిధంగా రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇక పార్కింగ్ కోసం నార్కట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో, ఎల్లారెడ్డిగూడెం నుంచి వచ్చే వారికి దారిలో, ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గ్రామ శివారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కొనసాగిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డిపో నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డినరీ సర్వీసు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా ఎల్లారెడ్డిగూడెంలో ఆగే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విచారణ కేంద్రాల ఏర్పాటు

గట్టుపైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి తినే ఆహార పదార్థాలు ఇచ్చినా తీసుకోవద్దని సూచించారు. భక్తులు కోనేరు వద్ద స్నానం ఆచరిస్తున్న సమయంలో, స్వామివారికి మొక్కులు సమర్పించే సమయంలో వారి వస్తువులను వారే భద్రపర్చుకోవాలని తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగనీయం

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ తెలిపారు. 8 ప్రదేశాల్లో భక్తులకు నీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా చెత్త కుండీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెండు షిఫ్టుల్లో ఇద్దరు డీఎల్‌పీఓలు, ఆరుగురు ఎంపీడీఓలు, తొమ్మిది మంది ఎంపీఓలు, 90 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 75 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది, 400 మంది ప్రైవేట్ సిబ్బంది బ్రహ్మోత్సవాల విధులు నిర్వహిస్తారని తెలిపారు.

900 మంది సిబ్బందితో భద్రత

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 93 మంది ఎస్‌ఐలు, 186 మంది మహిళా సిబ్బందితో కలిపి మొత్తం 900 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు వారికి కేటాయించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని కోరారు. దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, గుట్ట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైనా పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పెద్దకాపర్తి అబ్బాయి.. మాంచెస్టర్ అమ్మాయి



వివాహ బంధంతో ఒక్కటైన రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన రామన్నపేట సమితి మాజీ ప్రెసిడెంట్ కందిమళ్ల జగ్గారెడ్డి మనుమడు రాజీవ్‌రెడ్డికి యూకేలోని మాంచెస్టర్‌కు చెందిన యువతితో శనివారం వివాహం జరిగింది. రాజీవ్‌రెడ్డి మాంచెస్టర్‌లో హోటల్ మేనేజమెంట్ కోర్సు పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే పోలీస్‌శాఖలో పనిచేస్తున్న లారెన్ ఫిషర్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో శనివారం మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. తమ కుమార్తె తెలంగాణ ఇంటి కోడలు కావటం ఎంతో ఆనందంగా ఉందని వధువు తల్లిదండ్రులు కే.ఫిషర్ డేవ్ ఫిషర్ ఆనందం వ్యక్తం చేశారు. పెళ్లి కుమారుడి తల్లిదండ్రులు మహేందర్‌రెడ్డి–ప్రేమలత ఇరుకుటుంబాలకు చెందిన పెద్దలతో పాటు పెద్దకాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి–రేణుక, కందిమళ్ల జైపాల్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని గంటిల రంగయ్యకు చెందిన జనరల్ స్టోర్స్‌లోకి ఆదివారం రాత్రి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. దీంతో షాపు వద్ద ఉన్న యాదయ్య, భిక్షపతికి గాయాలయ్యాయి. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భయపడిన డ్రైవర్, కారును రోడ్డు వైపు మళ్లించే క్రమంలో అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ ఉద్యోగులకు గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ ఉద్యోగులైన గరిణేపల్లి నర్సింహారావు, వడ్డెబోయిన వెంకటేశ్వర్లు డ్రైవర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి డ్యూటీలో భాగంగా సూర్యాపేట నుంచి నల్లగొండకు ప్రభుత్వ బొలేరో వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని అయిటిపాముల గ్రామ శివారులో గల శ్రీరాఘవేంద్ర పెట్రో అల్లాయిస్ కంపెనీ వద్దకు రాగానే ముందు వెళుతున్న కంటైనర్ లారీ డ్రైవర్ సుజిత్ కుమార్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ప్రభుత్వ బొలేరో వాహనం అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న గూడ్స్ బొలేరో వాహనం ఆర్టీసీ ప్రభుత్వ వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టడంతో ప్రభుత్వ వాహనం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. బొలేరోలోని క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను పోలీసులు, స్థానికులు బయటకు తీశారు. ప్రమాదానికి గురైన వాహనాలు రోడ్డు పై ఉండటంతో హైవే సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను పోలీసులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిర్యాలగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి తుక్కోని శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

నకిలీ విలేకరుల అరెస్ట్

- సీఐని వేధించి అక్రమ వసూళ్లకు పాల్పడిన నిందితులు
- ఉన్నతాధికారులను ఆశ్రయించిన సీఐ
- దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- పరారీలో మరో నకిలీ విలేకరి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: కొందరు ప్రభుత్వ అధికారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరులను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖర రాజు ఆదివారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో వెల్లడించారు. గత నెల రోజులుగా ఓ డిజిటల్ పేపర్‌లో వీరగాథ అనే శీర్షికన ఆ పేపర్ బ్యూరో ఎడిటర్ ఆనంద్‌కుమార్, మర్రిగూడ మండలం మట్టిపర్తి గ్రామానికి చెందిన స్టాఫర్ తుప్పరి రఘు, మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామానికి చెందిన పేరబోయిన ఆంజనేయులు ఎలాంటి ఆధారాలు లేకుండా వార్తలు రాసి డిజిటల్ పేపర్ ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వారి అసత్య వార్తలతో తీవ్ర మనోవేదనకు గురైన సీఐ సదరు వ్యక్తులను సంప్రదించగా రూ.5 లక్షలు ఇస్తే తమరిపై వార్తలు రాయడం మానేస్తామని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఐ తన స్నేహితుడికి చెప్పాడు. ఆయన సలహా మేరకు విలేకరి అంజిని గత నెల 24న తన ఇంటికి రమ్మని చెప్పి వారితో మాట్లాడి రూ.1.10 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించి ఆ డబ్బులను అందజేశాడు. దీనికి సంబంధించిన లావాదేవీల ఆధారాలతో పాటు ఆంజనేయులకు డబ్బులు వచ్చే వీడియోను పోలీసులు సేకరించారు. అయితే మిగిలిన రూ.4 లక్షలు కూడా ఇవ్వాలని గత కొద్ది రోజులుగా సదరు సీఐని బెదిరింపులకు పాల్పడుతుండడంతో చివరకు సీఐ మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సోషల్ మీడియాలో వైరల్ కావడంతో..

వీరగాథ పేరుతో రాసిన వార్తలకు విలేకరులు ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఈ విషయాలు బయటకు పొక్కడంతో విలేకరుల బాగోతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో సదరు డిజిటల్ పేపర్ విలేకరుల బాధితులు ఒక్కరొక్కరుగా బయటకు వచ్చి ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. నాగార్జున సాగర్ అటవీశాఖ అధికారిగా పని చేస్తున్న వ్యక్తి గతంలో తనను బ్లాక్ మెయిల్ చేశారని రూ.50 వేలు రూపాయలు ఫోన్‌పే ద్వార వసూలు చేశారని నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా సూర్యాపేటలో ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ అధికారిని బెదిరించి అప్పట్లో రూ.50 వేలు వసూలు చేశారని ఫిర్యాదు అందడంతో అన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు ఆదివారం తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బ్యూరో ఎడిటర్ ఆనంద్‌కుమార్ పరారీలో ఉన్నాడని, పట్టుకునేందుకు టీంలు ఏర్పాటు చేశామని త్వరలోనే అతడినికూడా అరెస్టు చేస్తామని తెలిపారు. పట్టుబడ్డ నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వారు వాడిన కారును కూడా సీజ్ చేస్తామని చెప్పారు.

50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

- ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన 1974–75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1974– 75 బ్యాచ్‌కు చెందిన ఏడో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన తోటి స్నేహితులైన బొంత నాగమ్మ, బండ ప్రమీలను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పొలిశెట్టి అంజయ్య, ముచ్చర్ల గంగాధర్, ముచ్చర్ల చిన్న నరసింహారావు, వేనేపల్లి నరసింహారావు, బండ సత్యనారాయణరెడ్డి, లక్ష్మి, చంద్రకళ, చందా యాదగిరి, జాన్సన్, కుక్కునూరు వెంకటేశ్వర్లు, కీసరి రామరావు, బండ వెంకటమ్మ, భారతమ్మ, ఎడవెల్లి అమృతారెడ్డితో పాటు సన్మాన గ్రహీతలైన ఉపాధ్యాయులు పెరుమాళ్ల రామ్మూర్తి, అలుగుబెల్లి లక్ష్మారెడ్డి, రాగిరెడ్డి అమృతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాచరణను ప్రారంభించాలి



మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: పార్టీ శ్రేణులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యాచరణను ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ, మండల బూత్ అధ్యక్షుల సమావేశం ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం బీజేపీకి మాత్రమే ప్రజల ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. ప్రజలతో నిత్యం కలిసే ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు నాయకులు పనిచేయాలన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్‌ను ఎండగట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్, మండల అధ్యక్షులు కదారి కల్పన, కై రకొండ అశోక్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు బందారపు లింగస్వామి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, గడ్డం నర్సింహ, పాలకూర్ల జంగయ్య, ముత్యాల భూపాల్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, దాసోజు భిక్షమాచారి, రిక్కల సుధాకర్‌రెడ్డి, చినుకని మల్లేష్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, మునగాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం చేసిన మోదీ

- నిధుల కోసం ఢిల్లీ వెళ్లినా పట్టించుకోని కేంద్రం
- బీజేపీ ఎంపీలు ఎన్ని నిధులిస్తారో చెప్పాలి
- విలేకరుల సమావేశంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని ఫ్లెక్సీని చూపుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో మోదీ ప్రభుత్వం వివక్ష చూపిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం భువనగిరిలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన వివరించారు. కేంద్రం విభజన హామీలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి నిధుల్లో మొండి చేయిచూపారన్నారు. కేంద్రానికి ఢిల్లీ,బిహార్ ఎన్నికలు కనిపిస్తున్నాయి తప్ప, మిగతా రాష్ట్రాలు, తెలంగాణ రాష్ట్రం కనిపించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి నిధులు రూ.లక్షా 63 కోట్లు తెలంగాణ అభివృద్ధి కోసం అడిగినా కేటాయించలేదన్నారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన మూసీ ప్రక్షాళన కోసం అడిగిన ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించిన రాష్ట్రంపై మోదీకి ప్రేమ లేదన్నారు. బ్రహ్మాండమైన బడ్జెట్ అంటున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రూ. 50 కోట్ల లక్షల నిధుల్లో తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకొస్తారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి పార్లమెంట్‌లో జరిగే చర్చలో బీజేపీ ఎంపీలు తెలంగాణకు రావాల్సిన నిధులను ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు కేంద్రం నుంచి ఎలాంటి గ్రాంట్స్ మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం నుంచి 5 శాతం జీడీపీ వచ్చినా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని తెలిపారు.

బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

నాగారం: బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. ఆదివారం నాగారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలో గత సంవత్సరం నవంబర్‌లో గ్రామానికి చెందిన ఓర్సు అశోక్‌కు చెందిన బుల్లెట్ బైక్‌ను సూర్యాపేటలోని తాళ్లగడ్డకు చెందిన శ్రీమాన్ అపహరించాడు. దర్యాప్తు అనంతరం నిందితుడిని పట్టుకొని, బైక్ రికవరీ చేసి అశోక్‌కు అప్పగించినట్లు తెలిపారు. శ్రీమాన్‌ను కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండ్ చేసినట్లు చెప్పారు.

ది అవార్డు 1996 చిత్రం ట్రైలర్ విడుదల

- నిర్మాతగా చౌటుప్పల్ వాసి ధనుంజయ్య
- దర్శకుడు పోచంపల్లికి చెందిన విజయ్‌కుమార్ సారథ్యంలో చిత్రం రూపకల్పన



సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్‌బాబుతో చిరందాసు ధనుంజయ్య, బడుగు విజయ్‌కుమార్

చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి: చౌటుప్పల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చిరందాసు ధనుంజయ్య నిర్మాతగా, భూదాన్‌పోచంపల్లికి చెందిన యువకుడు బడుగు విజయ్‌కుమార్ దర్శకత్వంలో మెగామేజ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై గ్రామీణ వాతావరణంలో చేనేత కళాకారుల ఇతివృత్తంపై ది అవార్డ్ 1996 చిత్రాన్ని నిర్మించారు. దీనికి సంబంధించిన ట్రైలర్‌ను ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు హైదరాబాద్‌లోని రామానాయుడు సినీ స్టూడియోలో విడుదల చేశారు. దర్శక, నిర్మాత, హీరో శివరాం రెడ్డి, హీరోయిన్ చందన, ఇతర సాంకేతిక నిపుణులతో కలిసి ట్రైలర్‌లో సినిమాను వీక్షించారు. దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ.. చేనేత కళాకారులు దళారుల చేతిలో ఎలా మోసపోతున్నారనే ఇతివృత్తంతో మంచి సోషల్ ఎలిమెంట్స్‌తో చిత్రాన్ని నిర్మించిన దర్శక, నిర్మాతలను అభినందించారు. చిత్ర నిర్మాత చిరందాసు ధనుంజయ్య, దర్శకుడు బడుగు విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చిత్రాన్ని విడుదల చేస్తామని తెలిపారు.

వరికి ఆదిలోనే తెగుళ్ల బెడద



పోషకలోపంతో ఎర్రబారిన వరి

రామన్నపేట : వరికి ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. డిసెంబర్ మొదటి వారంలో యాసంగి నాట్లు మొదలయ్యాయి. సగానికిపైగా పొలాల్లో నాట్లువేసి నెల రోజులు గడిచింది. వరిచేలకు కాండం తొలుచు పురుగు, అగ్గి, మెడవిరుపు, ఆకు ఎండు తెగుళ్లతో పాటు సూక్ష్మపోషకాలు, జింకులోపం సమస్యలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మూసీ కాలువల కింద కాండం కుళ్లు తెగులు అధికంగా కనిపిస్తోంది.

వైభవంగా పెద్దగట్టు దిష్టిపూజ



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టులో లింగమంతుల స్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం



దిష్టిపూజ మహోత్సవానికి వస్తున్న భక్తులు



బందోబస్తుకు హాజరైన పోలీసులు



కేసారంలో కోలాటం వేస్తున్న మహిళలు